# చేతులు కాలాయి - ఆకులు కావాలి

కళ్ళుమూసుకొని కదలకుండా పడుకుందామనుకుంటే కంటిమీద రెప్పవాలడం కష్టమై పోయింది. బుర్రనిండా గిర్రుమంటున్న ఆలోచనలకు అర్ధరాత్రి, అపర్రాత్రి అనే తేడాలుండవు గదా! సాగర తరంగాల్లా వస్తూ పోతున్నాయి. గోడ గడియారం పన్నెండు కొట్టేసింది. గదిలో జీరో బల్బు వెలుగుతూంది. నాలిక తడిరిపోతుంది.

"పారూ! కాసిని మంచినీళ్ళందుకో!" పడుకునే అడిగేశాను.

కానీ... కానీ... ఏదీ నా పారు? నా పార్వతి ఎక్కడా? దిగ్గున లేచి కూర్చున్నాను.

ముప్పయ్యైదేళ్ళ క్రితం నాతో మూడు ముళ్ళు వేయించుకుని మూడు పురుషార్థాల్లో భాగస్వామియై, నా ముగ్గురు పిల్లలకు తల్లై, నాల్గో పురుషార్థాన్ని వెతుక్కుంటూ పునిస్త్రీగా పుణ్యలోకాల కెళ్ళి మూన్నెళ్లైంది గదూ! లేని పార్వతి ఉన్నదనుకుని నీళ్ళడిగాను... పిచ్చివాణ్ణి.

ప్చ్...! అత్తారింట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉందన్నట్టు... మనకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడళ్ళు, ఒక కూతురు, అల్లుడు, మనవలూ, మనవరాళ్ళు అందరూ ఉన్నారు, కానీ... మనతో ఎందరున్నారు? అని నేనంటే పార్వతి గమ్మత్తుగా నవ్వేది.

"మీదో పిచ్చిగానీ, రెక్కలొచ్చిన పక్షులు ఎగిరి పోకుండా ఉంటాయా?" వేదాంతిలా అడిగేది.

"మనం పక్షులం కాదు. సాక్షాత్తు మనుషులం. జన్మనిచ్చి పెంచిపోషించిన తల్లిదండ్రులకు సేవలందించే బాధ్యత వాళ్ళకు లేదా?" సాగదీస్తే మరోసారి నవ్వి "కె.జి. నుండి పీ.జి. దాకా హాస్టల్స్‌లో తిని ఇంగ్లీషు మీడియంలో చదివిన పిల్లలకి సంబంధాలెలా ఒంటబడతాయనుకున్నారు?' ' నిలదీసేది.

"ఏవిటో పార్వతీ! పిల్లలు పెద్ద చదువులు చదివి బాగా సంపాదించాలనుకున్నాను. పైరవీలకు తలవొగ్గి జీతాన్ని మించిన గీతాని కలవాటుపడ్డాను. ఎప్పుడెవడు ఏసీబికి పట్టిస్తాడోనని క్షణం క్షణం టెన్షన్‌తో గడిపాను. పిల్లల భవిష్యత్తు కోసం బంగారం లాంటి నా ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టాను. పైన ఆఫీసర్ల తిట్లు తింటూ, కింది అటెండర్లా భరించాను. అన్యాయపు సంపాదనకు అప్పులు జతచేసి కొడుకుల్ని విదేశాలకు పంపాను. కూతురుకు అమెరికా అల్లుణ్ణి కొనిచ్చాను..." నా గొంతులో గురగర.

అది కాస్త కనిపెట్టి చిరునవ్వుతో ఆపేసేది.

"అవన్నీ నాకు తెలీవా ? మీ ఆశల కనుగుణంగా కొడుకులు చేతులనిండా సంపాదిస్తున్నారు. అమ్మాయి గూడా సుఖంగా ఉంది. మనకింకేం కావాలండీ ?"

"అవును ! మనక్కావల్సింది వాళ్ళ సుఖం. వాళ్ళక్కావల్సింది గూడా అదే. మరైతే మన సంగతో !" ఎంత వద్దనుకున్నా గొంతు వణికేది.

కడుపులోని ఆవేదనను కళ్ళకు మాత్రమే పరిమితం చేసుకోవడములో ఆవిడకావిడే సాటి.

"మనకేమైందండీ ?" కొంగుతో కళ్ళద్దుకునేది. "మీకు నేనున్నాను. నాకు మీరున్నారు. మనకు సొంత ఇల్లుంది. మీకు పెన్షనొస్తుంది...."

"కొడుకులూ కోడళ్ళు చిలకా గోరింకల్లా మన కళ్ళముందు తిరగాలనీ, మనవలూ, మనవరాళ్ళతో ఆడుకోవాలనీ ఆశగా ఉంది పార్వతీ"

నా ఆశ నిరాశేనని ఆవిడకు తెలుసు. అందుకే నేరుగా జవాబివ్వకుండా "అబ్బబ్బా ! తలాతోక లేని మీ ఆశాపాశాన్నింకా లాగించకండి. చేసుకున్నోళ్ళకు చేసుకున్నంత మహాదేవ" మందలించేది.

తీర్థయాత్రలకు తానే బయలుదేర దీసింది. అప్పులకు పోగా మిగిలిన గ్రాట్యుటీ గవ్వలతో కాశ్మీరం నుండి కన్యాకుమారి దాకా తిప్పింది.

అలాంటి అమృతమూర్తి... ఇలా నన్ను వైపత్నీకమనుభవించుమని శపించి తన దారి తాను చూసుకుంది... ! చెంపల మీద వెచ్చగా తాకింది. అరచేత్తో తడిమాను. కన్నీటి బొట్లు కపోలాలలను తడిపేస్తున్నాయి.

లేచి ట్యూబులైటు వేశాను. గ్లాసెడు నీళ్ళు గబుక్కున తాగేశాను.

"దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కండీ !" దేవాలయం ముందున్న బిచ్చగాళ్ళకు దానం చేస్తూ, అన్న పార్వతి ఎదతెరమీద ప్రత్యక్షమై వెంకటేశ్వరుని పటందాకా నడిపించింది. ఏడు కొండల వాడిమీద పంచప్రాణాలుంచి ఐదు నిమిషాలు ధ్యానంలో గడిపాను. మనసు శుభ్రమైంది. పార్వతి అదృశ్యమైంది.

పొద్దున్నే పెన్షన్ కోసం బయలుదేరుతూ అప్పుడే వచ్చిన ఉత్తరాన్ని చదవకుండా పడేసిన సంగతి గుర్తుకొచ్చింది. కవరు చించి కాయితం విప్పగానే కళ్లు అక్షరాల వెంట పరుగెత్తాయి.

"వేణూ ! బాగున్నావా, లేక భార్యా వియోగాన్ని భరించలేక బెంబేలు పడిపోతున్నావా ! నీ పిల్లలంతా ఎప్పుడో వెళ్లి పోయారని రాశావు గదూ !

నిన్ను మా ఊరికి రమ్మనీ, మా ఇంట్లో కొద్ది రోజులుండి వెళ్ళమనీ ఎన్నిసార్లు రాసినా రాలేదు. ఇది ఫైనల్ వార్నింగ్. ఈ ఉత్తరం అందగానే వెంటనే బయలుదేరి రావాలి. లేకపోతే మా పిల్లలూ, నేను అంతా వచ్చి నీ ఇంటిముందు ధర్నా చేస్తామని మీ చెల్లాయి రాయమంది. జాగ్రత్త బాబూ !

- నీ బాల్య స్నేహితుడు

బాలరాజు

ఒరేయ్ బాలూ ! నిజాయితీగా ఉద్యోగం చేస్తూ అటు ప్రభుత్వంతో, ఇటు ప్రజలతో ప్రశంలందుకుంటూ రిటైరైన అదృష్టవంతుడివిరా ! సకుటుంబ సమేతంగా వచ్చి పార్వతి అంత్యక్రియలు దగ్గరుండి జరిపించావు గదూ ! నీ ఋణమెట్లా తీర్చుకోవాలిరా !

గజ్వేల్ గ్రామంలో బస్సుదిగాను. బాలరాజు అడ్రసు చెప్పి ఆటో ఎక్కేసరికి పొద్దు నెత్తిమీది కొచ్చింది. గజ్వేల్ అటు పట్టణమూ కాదు, ఇటు పల్లెటూరు కాదు. అయినా బహు అంతస్తుల మేడలు, శుభ్రమైన రోడ్ల మీద షికార్లు చేస్తున్న కార్లు... కంటికింపుగా ఉంది.

"బాగున్నావా బాబాయ్"

ఆటో దిగ్గానే బాలరాజు కోడలు జానకి ఎదురొచ్చి బ్యాగు అందుకుంది.

"బాగున్నానమ్మా !" జానకి తలనిమురుతూ గడపలో అడుగు పెట్టానోలేదో బాలరాజు ఏకైక పుత్రుడు సంతోష్ "ఓహ్... వేణు మామయ్యా !" అంటూ పరుగెత్తుకొచ్చి నా పాదాలు స్పృశించాడు. భార్య చేతిలోంచి బ్యాగు తీసుకున్నాడు.

"వ్యాపారమెట్లుందిరా సంతోష్" అడిగాను.

"మీ దయవల్ల బావుంది మామయ్యా !"

"అమ్మా... వేణు మామయ్యొచాడే !" బాలరాజు కూతురు గిరిజ కేకేసి కాళ్ళకు నీళ్లిచ్చింది.

కాళ్లూ చేతులు కడుక్కొని "బాగున్నావామ్మా !" అంటూ తువ్వాలందుకున్నాను. గిరిజ నవ్వేసింది. కుర్చీలో కూచున్నాను.

చిరునవ్వులు చిందిస్తూ పరమేశ్వరి టీ కప్పుతో వచ్చింది.

"హమ్మయ్య ! ఈ చెల్లెలి మీద ఇన్నాళ్ళకు దయకల్గిందన్నమాట ! ఆరోగ్యం బాగుందా అన్నయ్యా ?"

పలుకరింపు తేట తేనియ జిలుకరింపు లాగుంది. ఒక్క గుటక చాయె కడుపులో పడగానే నరాల్లో సత్తువ పాకింది.

"చూడమ్మా పరమేశ్వరీ ! నాతో రక్తంపంచుకు పుట్టిన అక్కా చెల్లెళ్లు లేరు. నువ్వేనా చెల్లివి, రిటైరయ్యాక పెన్షన్, గ్రాట్యుటీల కోసం చెప్పులరిగే దాకా తిరిగాను. ఆ తర్వాత తీర్థయాత్రలు... అంతా అయాక మీ వదిన.... "

ముందుకు పోనివ్వలేదు.

"అంతా దేవుని లీల. ముందు స్నానానికి లేవండన్నయ్యా !" అప్యాయత అంతరంగాన్న లరించింది. నామనసులో మల్లెలు పూచినై.

"ఇంతకీ వాడేడమ్మా ?..."

"ఇదిగో వచ్చేశాన్రా ! ప్రయాణం బాగా సాగిందా ?" బాలరాజు గొంతు బలాన్నిచ్చింది. కరచాలనం చేసి కౌగిట్లోకి బంధించాడు. నందన వనములో విహరిస్తున్నట్టనిపించింది. అందుకే అంటారేమో - సృష్టిలో తీయనిది స్నేహమని.

బాత్రూంలో... ఓ బక్కెట్లో వేడినీళ్ళు, మరో బక్కెట్లో చన్నీళ్ళు, సబ్బు, తువ్వాలు... రెడీగున్నై. స్నానం చేసేసరికి నెత్తిమీంచి కొన్ని క్వింటాళ్ళ బరువు దించుకున్నట్లైంది.

"భోజనానికి రండి మామయ్యా !" చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళింది గిరిజ.

పరమేశ్వరి, జానకి, గిరిజ త్రిమాతల్లా కన్పించారు.

జానకి పరమేశ్వరి వైపు చూస్తూ "మేం వడ్డిస్తాం. మీరు కూచోండత్తయ్యా !" అంటూ దృష్టి సంతోష్ వైపు మళ్లించింది.

"అవును. మీరు కూచోండి నాన్నా !" సంతోష్ బలపరిచాడు.

అంతా కలిసి కూచున్నాం.

ఓర చూపులు, ముసిముసి నవ్వులతో జానకి సంతోష్‌లు వడ్డిస్తుంటే మాటలతో, ఛలోక్తులతో భోజనం ముగించాం.

"ఇక మీరు భోంచెయ్యండి వదినా ! మేం వెళ్తున్నాం"

జానకి జడ లాగి చెంప గిల్లింది కొంటె గిరిజ. "మీ ఇద్దరి మధ్య పానకంలో పుడకలా మేమెందుకూ" అనే ధ్వని ఉందామాటలో.

"హమ్మనా అర్థమొగుడా ! జడ అంత గట్టిగా లాగావా ! రానీ... మా అన్నయ్య రానీ చెప్తా నీ పని" జానకి చెంప పుణుక్కుంది. మాలో మేమే నవ్వుకుంటూ బయటికొచ్చేశాం.

సంతోష్ సతీసమేతంగా భోంచేశాడు. ఆ తర్వాత షాపు కెళ్ళాడు.

"బాబాయ్ ! మీరలా విశ్రాంతి తీసుకోండి" మంచం చూపించింది గిరిజ. మంచమ్మీద ఒరిగానో లేదో నిద్ర ముంచుకొచ్చింది.

"తాతయ్యా... తాతయ్యా!" పిలుపుతో మెలకువొచ్చింది. నా పక్కనే పడుకున్న బాలరాజు లేచి కూచున్నాడు.

"రారా నానీ... రా! బడినుండి వచ్చేశావన్నమాటా!" ఆరేళ్ళ కుర్రాడు ఒడిలో కూచుని కబుర్లు చెబుతూంటే బాలరాజు బాలుడై పోయాడు.

"ఒరేయ్ వేణూ ! వీడు సంతోష్ కొడుకు అగ్నివేష్. గుర్తుందా ?" నాతో అని "ఈ తాతయ్యకు నమస్కారం చేయ్" అగ్నివేష్‌నాదేశించాడు.

"నమస్తే తాతయ్యా:" కుర్రాడు బుల్లి చేతులు జోడించాడు.

"ఒరేయ్ అగ్నీ ! ఈ తాతయ్య నా నేస్తం. మేము చిన్నప్పుడు కలిసి ఆడుకున్నాం" బాలరాజు అన్నాడో లేదో కుర్రాడు దూకేశాడు.

"హాయ్ తాతయ్యా" అంటూ నా ఒడిలో కొచ్చేశాడు. "మా తాతయ్య నేస్తం నాకూ నేస్తమే" మురిసిపోయాడు.

కాస్సేపు పసివాడితో ఆటలు, మరికాసేపు బాలరాజుతో కబుర్లు, కాకరకాయలు... పొద్దెట్లా గడిచిందో తెలీదు.

అలవాటు ప్రకారం అర్ధరాత్రి దప్పికేసింది. నీళ్ళెక్కడున్నాయో ! కథ చెప్పించుకుంటూ నా పక్కనే పడుకున్న అగ్నివేష్ మీదుంది నా చెయ్యి

"నీళ్ళు ... ఒరేయ్ అగ్నీ! మంచినీళ్లురా !" బుగ్గలు నిమిరాను. వాడు లేచి కూర్చున్నాడు.

"నీళ్ళు కావాల్నా తాతయ్యా ?" అన్నాడు. గునగునా వెళ్ళిగ్లాసెడు తెచ్చిచ్చాడు. గటగటా తాగేశాను.

"చలేస్తోంది. కప్పుకుందాం తాతయ్యా !" అంటూ దుప్పటి విప్పి నాకు కప్పి దాంట్లో తానూ దూరాడు. నా మీద చెయ్యేసి పడుకున్నాడు. ఆ చిన్నారి హస్తస్పర్శతో నా ఒళ్ళు ఆనంద పరవశమైంది. అదొక దివ్యానుభూతి. అదే నిద్రలోకి లాక్కెళ్ళింది.

ఎప్పుడు తెల్లవారిందో ... సూర్యకిరణాలు నా చెంపల్ని నిమురుతున్నాయి. అవి పెరటి కిటికీ లోంచి చొచ్చుకువచ్చినవి.

"వేణూ... వేణూ !" హుషారుగా పిలుస్తున్నాడు బాలరాజు. లేచి జూద్దునుగదా... బాలరాజు. తెల్లలుంగీ, బనీను, నుదుట భస్మం రేఖలు, ఫాల భాగంలో ఎర్రని బొట్టు. ఎగాదిగా చూశాను.

"అట్లా కొత్తగా చూస్తున్నావెందుకురా?" నాపక్కన కూచున్నాడు.

"ఏం లేదురా ! అరవయ్యేళ్ళ వయసులో ఇరవయ్యేళ్ళ కుర్రాడిలా ఉన్నావనీ"

"చాల్లేరా జోకు... సూర్యుని కంటె ముందు లేచి కాలకృత్యాలు ముగించి చిన్న చిన్న యోగాసనాలు వేశాను. స్నానం, పూజ ముగించుకున్నానంతే."

ఉద్యోగపర్వములో గర్వంగా ఉన్నన్ని రోజుల పొద్దున్నే నిద్రలేచి, రాత్రి పొద్దుపోయే దాకా సంపాదన గురించే వ్యూహాలు రచించిన నా దృష్టి అటువైపు వెళ్ళనే లేదు ! కాలకృత్యాలు, స్నానం ముగించుకొచ్చాను.

చెరోకుర్చీలో కూచుండి అప్పుడే వచ్చిన న్యూసు పేపరు రెక్కలు విప్పుతున్నాం.

కాలి మువ్వల సవ్వడి సన్నగా, మృదంగవాద్యంలా చెవులకింపుగా వినబడింది. నా దృష్టి మళ్ళింది.

గులాబిరంగు తీగల అంచుగల లేతాకు పచ్చ మైసూర్ సిల్క్ చీర, సాయపసుపులో మెరిసిపోతున్న ముఖారవిందము, నల్లని జడనుండి భుజాలు దాటి ముందుకొచ్చిన తెల్లని మల్లెదండ, నుదుట అర్ధరూపాయి కాసంత కుంకుమ బొట్టు, అన్నింటినీ మించి పెదాల మీద చిందులేస్తున్న చిరునవ్వు. జానకి... అపర జానకీ దేవిలా కదిలొస్తుంది.

"ఇదిగో బాబాయ్!" చెరో చాయకప్పు అందించింది. ఆ తల్లికి చేతులెత్తి దండం బెట్టాలన్పించింది,. కాని... చిన్న పిల్ల.. మనసులోనే ఆశీర్వదించాను.

ఇటు చాయ్ కప్పు ఖాళీ అవుతూంది. అటు పత్రికా పఠనం సాగుతూంది. మనసాగలేదు.

"నువ్వదృష్టవంతుడివిరా :" అనేశాను.

"అదెట్లారా?" కనుబొమలెగరేస్తూ పేపరు పక్కన పెట్టేశాడు.

"కళ్ళముందు చిలకాగోరింకల్లా తిరుగుతున్న కోడలూ - కొడుకు, మణిపూసలాంటి మనవడూ, లక్ష్మీదేవి లాంటి కూతురూ..." మనసు మరింత పొంగింది.

"పిల్లల్ని కళ్ళముందుంచుకుని చదివించాను, పెంచాను గదా ! అయినా నీ గ్గాడా ఉన్నారు గదరా !"

అక్కరకు రాని చుట్టము... పద్యము గుర్తు కొచ్చింది. ఆ భావం పైకి వ్యక్తం చేస్తే బావుండదు..." ఉన్నారు. నానా గడ్డి కరిచి వాళ్ళను ఏనుగులెక్కించాను. ప్చ్ ... నా కందుబాటులో లేనంత ఎత్తుకెదిగిపోయారు".

టకటక బూట్ల శబ్దం...

"బావున్నారా మామయ్యా:" బాలరాజు కభివాదము చేస్తూ ఓ యువకుడు బ్రీఫ్ కేస్‌తో వచ్చి మా ముందు నించున్నాడు. ఎక్కడో చూశానతడ్ని...

"ఆ... బాగున్నామల్లుడూ!" బాలరాజు మొహం బంతిపూవైంది. "బాలూ!... గుర్తు బట్టావా, ఇతడూ....."

"నీ అల్లుడు. గిరిజ బెటరాఫ్ గదూ!" బుర్రలో బల్బువెలిగింది. కాని పేరు...." బుర్ర గోక్కున్నాను.

"అవున్లే... ఎందుగ్గుర్తుంటుందీ! గిరిజ పెళ్ళికి మా చెల్లాయితో వచ్చి వెళ్ళావు. మళ్ళీ రాలేదుగదా ! నేను మాత్రం నెలకొకసారన్నా రెక్కలు కట్టుకుని నీ ఇంట్లో వాల్తున్నాను..."

అది దెప్పిపొడుపైనా తియ్యగా ఉంది.

"నమస్కారం బాబాయ్! నాపేరు రామకృష్ణ" చేతులు జోడించాడా ఇంటల్లుడు.

"నమస్కారం బాబూ !... "

"హాయ్ బావాజీ !" సంతోష్ వచ్చేశాడు. బ్రీఫ్‌కేసందుకుని వెనకనే వచ్చి నుంచున్న గిరిజ కందించాడు. గిరిజ ముఖపద్మం సహస్రదళాలుగా విచ్చుకుంది. బుగ్గల మీది సిగ్గులు పెదాల మీదికి జారి వాటిని వణికిస్తున్నాయి.

"మీకు తెల్సా మావయ్యా : మా బావ తండ్రి కాబోతున్నాడు. వచ్చే నెలలో మా గిరిజకు సీమంతం" గర్వంగా చెప్పేశాడు సంతోష్. "రండి బావ గారూ!" బావచెయ్యి బట్టి లాక్కెళ్ళి గిరిజ కందించాడు.

"రెండు వారాల ట్రెయినింగ్ కోసం ఎల్లుండి బెంగుళూరు బండెక్కాలి మామయ్యా" అంటూ గిరిజ వెంట గదిలోకెళ్ళాడు.

"మా అల్లునికేదో ప్రమోషన్ వచ్చిందని చెప్పింది గిరిజ. దాని కోసమే ఈ ట్రయినింగ యుంటుంది." బాలరాజు సంబరము ఏ కొలతకూ అందేలా లేదు.

"అయితే ఈ పదిహేను రోజులు గిరిజ ఇక్కడే ఉంటుందన్నమాటా!"

"ఇక్కడ కాకపోతే మరెక్కడుంటుందీ నాతల్లి?" తృప్తిగా నవ్వేశాడు.... ఆ రోజంతా హడావుడే.

జానకి, పరమేశ్వరిల చేతివంటలు... వంటలు కావవి అమృత ఝురులు.

మూడోరోజు రామకృష్ణ వెళ్ళిపోయాడు.

బాల్యస్మృతుల్ని నెమరేసుకుంటూ, కాలేజిలో చదువుకునేప్పుడు మా రూములో జరిగిన సంఘటనల్ని గుర్తు చేసుకుంటూ, లైబ్రరీ పుస్తకాలు తిరగేస్తూ, బాలరాజు కుటుంబ స్నేహితులతో ముచ్చటిస్తూ... రోజెలెలా గడుస్తున్నాయో తెలియడం లేదు.

వాళ్ళంతా సంతోషంగా ఉన్నారు. ఇంటింటి రామాయణములో చిన్న చిన్న సమస్యలొచ్చినా తమలో తామే పరిష్కరించు కుంటున్నారు. పిల్లలు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. స్వంత బుద్ధితో కొందరు, సమాజానికి భయపడి మరికొందరు తల్లిదండ్రుల్ని సంతోష పెడ్తున్నారు.

మరి... నా సంగతి.... ఇలా ఎందుకైందీ?

సంపాదన కంటే ముఖ్యమైంది మరొకటుందని ఇప్పుడిప్పుడే అర్థమవుతూంది. చదువుతో పాటు పిల్లలకు సంస్కారం రావాలని ఆలోచించక పోవడం నేరమని తెలుసుకుంటున్నాను.

చేతులు కాలేక ఆకుల కోసం వెతుక్కుంటున్నాను.

**జాగృతి విక్రమ ఉగాది ప్రత్యేక సంచిక, ఏప్రిల్ 3-9, 2000**